శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౫.] రాజమహేంద్రవరము. మన్మథసంవత్సర శ్రావణమాసము. [సంచిక. ౨.

చింతామణి బహుమాన నిర్ణయము.

ఈసంవత్సరము చింతామణి బహుమానముల నిమిత్తము మావద్దకు వచన ప్రబంధములు పది పంపఁబడినవి. ఇట్లు పంపఁబడిన గ్రంథములలో భాషాసౌష్ఠవమును బట్టిగాని కథాచమత్కారమునుబట్టిగాని యితరగుణాంశములనుబట్టిగాని యగ్రగణ్యమైనదిగా నేదియు మాకగపడలేదు. అయినను వ్రాయఁబడిన గ్రంథములలో రెంటికి బహుమానముల నిచ్చెదమని ప్రకటించియున్నందున, ఈ యున్నవానిలోనే మాకు మంచివిగా కనఁబడినవానిని రెంటి నేర్పఱిచి బహుమతు లియ్యవలసివచ్చినది. సమష్టి మీఁద కథనుబట్టియు శైలినిబట్టియు నీతి బోధకత్వమునుబట్టియు విచారించినమీఁదటఁ బ్రస్తుతమున్నవానిలో తేకుమళ్ల రాజగోపాలరావు గారిచే రచియింపఁబడిన త్రివిక్రమ విలాసమును, ఖండవిల్లి రామచంద్రుఁడుగారిచే రచియింపఁబడిన మాలతీ రాఘవీయమును బహుమానముల కర్హములయినవిగా తోఁచినందున, ఆగ్రంథకర్తలకు బహుమానములిచ్చి యీమాసము మొదలుకొని యీపత్రికయందాగ్రంథములను బ్రచురించుచున్నాము. ఈపుస్తకములలో నేదియు ప్రథమ బహుమానమున కర్హమయినదిగా కనఁబడనందునను, బహుమతులియ్య నిశ్చయించిన గ్రంథములలో తారతమ్యము విశేషముగా లేనందునను, బహుమానధనము నంతను జేర్చి రెండు సమభాగములుచేసి చెఱి నూఱు రూపాయల నిచ్చుచున్నాము.

కృతివిమర్శనము.

కుమారశతకము:— ఈ శతకము రాజమంద్రి టవునుహాలులో లైబ్రేరియనుగా నున్న కందుకూరి రామారావుగారిచే రచియింపఁబడినది. ఈ నీతిశతకము బాలుర యుపయోగార్థమై వ్రాయఁబడినది. ఇందు లేఖక ప్రమాదజనిత దోషంబు లచ్చటచ్చటఁ గానంబడినను, కవిత్వముఁజెప్పుట కీగ్రంథకర్త కిదితొలి ప్రథమప్రయత్నమగుటంజేసియు,

గ్రంథకర్త పిన్నవయస్కుడగుటం జేసియు, ఆర్యులు వానిని మన్నించెదరని నమ్ముచున్నారము. బాలు రిట్టిప్రయత్నములకుం బూనినప్పుడు, తప్పులు సైరించి వారికి మిగుల ప్రోత్సాహము గలుగఁజేయుటయే పెద్దలకుఁ బ్రధానమైన కార్యమని మేము నొక్కి వక్కాణించ నక్కరలేదు. ఈ గ్రంథమునుగూర్చి వ్రాయఁబడిన విమర్శనములఁజూచి నిరుత్సాహపడక పలువిధములయిన నీతులను దెలుపుడుచేయు చిన్న పుస్తకములను వ్రాయుచు నీ గ్రంథకర్త జనోపయోగార్థమై మిగుల పాటుపడునట్లు కటాక్షించుటకు శ్రీసర్వేశ్వరుని మేము సదా ప్రార్థించుచున్నాము. ఈగ్రంథకర్తశైలి నుదాహరించుటకై కొన్ని పద్యంబుల నీక్రిందఁ బొందుపరుచుచున్నాము.

క. బొమ్మల కెప్పుడు పూజలు । సమ్మదమున సలుపనీకు సంతసమెపుడున్
ఇమ్మగ గలుగదు కావున । నెమ్మనమున దేవుఁదలప నేర్వుకుమారా.

క. భాషింపకు తులువలతో । భూషింపకు నీదుజనము; పోరుచుపరులన్
దూషింపకు మేపట్టున । పోషింపకు దుష్టునెపుడుఁ బుడమికుమారా.

క. కుడువకు మెండుగ నేదియు । ముడువకు కుసుమంబు లెపుడు మోదముతోడన్
నడువకు బోగపు వీధుల । విడువకు మేలైననీతి వినుము కుమారా.

క. మూడలతో బరుగెత్తకు । గోడల నెప్పుడును దూకగూడదు సుమ్మా
చేడెలతో మాటాడకు । గూడుల దీయంగబోకు కూర్మికుమారా.

వలయువారు రాజమహేంద్రవరము గ్రంథకర్తగారికి వ్రాసి పుస్తకములను తీసికొనవచ్చును. వెల ఒక అణా.

బకవామన సంగ్రామము: — ప్రస్తుతము రాణ్మహేంద్రపుర నివాసస్థులగు మహారాజశ్రీ గరుడా వెంకట నారాయణసెట్టి గారిచే రచింపఁబడిన బకవామన సంగ్రామ మను వచనప్రబంధము మా కార్యస్థానము నలంకరించినది. ఈ గ్రంథమును గూర్చి గ్రంథకర్తగారు పీఠికయం దీప్రకారము వ్రాసియున్నారు.

“ఇందు పెక్కునీతు లిమిడియుండుట నిట్లు । పలికినాడగాని ప్రజ్ఞ సూప
బలుకలేదు దీనిభావంబు గన్గొని । యాదరింపవలయు నార్యులెల్ల.

ఈ కథారత్నము నాంగ్లేయభాషకు మేటియని బిరుదందిన బీటీదార కావ్యత్రయంబుగ గావించియుండ వానియందలి ముఖ్యాంశంబుల నన్నింటిం గొని యాంధ్రబాలుర కభిరుచిగనుండు గాథ లనేకముల జేర్చి రచింపఁబడినది. ఇందలి కథ మిగుల రమ్యమై మనోహరమైయున్నది. శైలి మృదువై సర్వజనసామాన్య గ్రాహ్యమైయున్నది. ఇందలి కథాంశము ‘సార్థపద శరీరధారులగు పిగ్మీలకును, నండజంబులగు బకంబులకును జరిగిన యుద్ధము’ పిగ్మీలనఁగా అఱడుగు మెయిదాల్పుగల మనుజులు వీరికిని

బకంబులంను జరిగిన ఘోరసంగ్రామంబునందు గుజ్జులందరు గూలినశించిరి. ఈ కథ ప్రపంచమందలి మహిమలెల్లఁ బ్రస్తుతంబుననే గాని పిమ్మట నిలువవనుటకు తార్కాణమై యున్నది. ఈ గ్రంథము ప్రతివారును జదువఁదగినదై యున్నది. గ్రంథకర్తగారికి రాజమంద్రి వ్రాసినయెడల నొక అణా విలువకు పుస్తకములు దొరకును. A. S.

వివాహనిషేకధర్మప్రదీపిక.

ఇది గుత్తిపురమునందుండు బ్రహ్మశ్రీ జంగమకోటి శ్రీనివాసరావుగారిచే రచియింపఁబడి, గ్రంథకర్తగారిచేఁ బ్రీతిపూర్వకముగా మాకుఁ బంపఁబడినది. హిందూధర్మశాస్త్రములను, ఇంగ్లీషు పుస్తకములను సంశోధించి గ్రంథకర్తగా రీపుస్తకమును మిక్కిలి కష్టపడి యిన్నూటయిరువది పుటలలో రచియించియున్నారు. ఇంచుపయుక్తాంశము లనేకము లున్నందున, ఇది యెల్లవారును జదువఁదగినదని మేము దృఢముగాఁ జెప్పఁగలము. అయినను గొన్ని విషయములలో మేము గ్రంథకర్తగారి యభిప్రాయములతో నేకీభవించుచున్నను గొన్ని విషయములలో నేకీభవింపఁజాలము. మన పూర్వులు సర్వజ్ఞులనియు, వారు చెప్పినదెల్లను యుక్తికిని దేశక్షేమమునకు ననుకూలముగా నుండుననియు, పూర్ణముగా విశ్వసించినవారయి యట్టి సిద్ధాంతమును స్థాపనము చేయ నుద్దేశముతో గ్రంథకర్తగారు శ్రమచేసి తదనుకూలములయిన హూణభాషా పండితుల యభిప్రాయములను సంగ్రహించి వ్రాసియున్నారు. హూణభాషాపండితుల వాక్యములకు వారుచేసిన యర్థములను గొన్నిటిని సరియైనవని మే మంగీకరింపఁజాలము. స్థాలీపులాకన్యాయముగా నట్టిదాని నొక్కటిమాత్ర మిందుఁ బేర్కొనుచున్నాము.

శ్రీనివాసరావుగారు తమ గ్రంథములో (౩౭-౩౮ పుటలలో) కన్యావరుల వయస్సునుగూర్చి యిట్లు వ్రాయుచున్నారు.— "శ్లో. త్రింశద్వర్షో వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీమ్ । త్ర్యష్టవర్షోష్టవర్షాంవా ధర్మేసీదతితత్వర." అనగా పండ్రెండు సంవత్సరముల కన్యను ముప్పది సంవత్సరముల ప్రాయముగలవాడును, యెనిమిదేండ్ల పిల్లను యిరువదినాలుగేండ్లవాడును, వివాహము జేసికోవచ్చును. ఆవయస్సుమీరిన వారాప్రాయమందుండిన కన్యను వివాహము చేసికొన్నట్లయిన ధర్మమునుండి తొలగినవారగుదురు. ఇందుచే ముప్పదిసంవత్సరములు మీరినవారు పండ్రెండుసంవత్సరముల వయస్సుకు లోపలనుండు కన్యను జేసికొనుట శాస్త్రసమ్మతము కాదని స్పష్టమగుచున్నది. శ్లో. త్రింశద్వర్షో దశాబ్దాంతు భార్యాం విందేత నగ్నికాం। ఏకవింశతి వర్షోవా సప్తవర్షామవాప్నుయాత్. అనగా ముప్పదియేండ్లవాడు పదిసంవత్సరముల కన్యను, యిరువదొక్క సంవత్సరములవాఁడు యేడేండ్లపిల్లను

పెండ్లిచేసికోవచ్చునని బృహస్పతి ప్రమాణవచనముగలదు. విష్ణుపురాణమందు 'వర్షై రేక గుణాంభార్యా ముద్వహేత్ త్రిగుణస్స్వయమ్' అనగా కన్యవయస్సుకంటె వరుని వయస్సు మూడంత లుండవచ్చునని తాత్పర్యము. కాబట్టి కన్యవయస్సుకంటె మూడంతలు మీరినవయస్సుగలవారు అట్టి కన్యను వివాహముజేసికొనకూడదని నిశ్చయ మగుచున్న దనుటకు సంశయములేదు."

అని వ్రాసి గ్రంథకర్తగారు తమ యభిప్రాయమున కుపబలముగా అమెరికాదేశ శాస్త్రజ్ఞుఁడగు యస్- ఆర్- వెల్సు అను నాతఁడు వ్రాసిన గ్రంథమునుండి "Nature has indicated with sufficient clearness that there should be a slight difference in age between the male and the female on assuming the marriage relation. As the girl arrives at womanhood two or three years earlier than the boy reaches manhood, we may infer that the husband should be at least as many years older than the wife." అను వాక్యములను గైకొని వానిని "స్వభావ ధర్మవివాహము చేసికొనుట కపేక్షించువారి కిరువురకును కొంచముగా వయోభేదముండవలెనని చాలినంత విశదముగా తెలియజేయుచున్నది. బాలికలు బాలురకంటె రెండుమూడు సంవత్సరములకు ముందుగానే యావనదశ పొందు చున్నారు. కాబట్టి భర్త భార్యకంటె రెండంతలైనా పెద్దవాడుగా నుండవలెను." అని తెనిఁగించి, "పైనుదహరించిన యమెరికాదేశ శాస్త్రజ్ఞుని ప్రమాణముచే కన్య వయస్సుకంటె వరునివయస్సు రెండింతలుండుట స్వభావధర్మమని తెలియుచున్నది గదా. మన శాస్త్రకారులును అవ్విధముగానే చెప్పుచు అత్యంత పరిమితి కన్యవయస్సు కంటె రెండింత లధికముగా నుండవలెనని విధించియున్నారు." అని తమ యభిప్రాయ మును దెలిపియున్నారు. పయిశాస్త్రజ్ఞుఁడు యావనదశను బొందుటలో స్వభావము చేతనే స్త్రీపురుషులకు రెండుమూడు సంవత్సరములు వ్యత్యాసమున్నందున భార్య కంటె భర్త రెండుమూడు సంవత్సరము లైనను పెద్దవాఁడుగా నుండవలెనని వ్రాసినట్టు మాకర్థమగుచున్నదిగాని గ్రంథకర్తగారు చెప్పునట్లు వధువు వయస్సునకంటె వరుని వయస్సు ద్విగుణముగా నుండవలెనన్న యర్థ మా వాక్యములలో మాకు గోచరము కాలేదు. వయస్సు మీఱినతరువాతనే వివాహములు జరగెడి యాదేశమునం దిరువదియై దేండ్ల పడుచేఁబదియేండ్లవానినో డెబ్బదియైదేండ్లవానినో పెండ్లియాడవలెనని మతి మంతుఁడు చెప్ప సాహసించునా? ఈ గ్రంథముయొక్క వెల రు ౧—౮—౦ లు. కావలసినవారు గ్రంథకర్తగారిపేర గుత్తికి వ్రాసి తెప్పించుకోవచ్చును.


కృతివిమర్శనము.

కేసరీవిలాసము:—మదరాసు హైకోర్టు లాయరుగారగు మహారాజశ్రీ-రేంటాల వెంకటసుబ్బరావుపంతులుగారిచే రచియింపఁబడిన కేసరీవిలాసమను నూతన వచన ప్రబంధము మా కార్యస్థానముచేరినది. ఇందలి కథ మిగుల చిత్రమై మనోహరమై యున్నది. శైలి మృదువై నాతికఠినమై సర్వజనసామాన్య గ్రాహ్యమైయున్నది. గ్రంథకర్తగారిట్టిగ్రంథముల నింకఁ గొన్నిటిని వ్రాయనుద్దేశించినట్టు లిందలి ప్రథమపత్రమునుబట్టియే తేటపడుచున్నది. వీరి యుద్యమములను సర్వేశ్వరుఁడు కొనసాగించుఁగాత! గ్రంథమునందు గ్రామ్యపదములు మొదలగునవి పెక్కులు గాన్పించుచున్నవి. గ్రంథాదియందు 'శిరోమణి' కి పండ్రెండు వత్సరంబులును 'కేసరి' కి నేడు వత్సరములునుగల కాలముందే వారికొండురులయందుఁ 'జెప్పఁదరముగాని ప్రేమానుబంధ' మేర్పడినట్లు వ్రాయఁబడియున్నది. వీరి కప్పటికింక నైదు వత్సరములు హెచ్చుగానున్నట్టు కల్పించియుండిన బాగుండునని మా యభిప్రాయము. ఈకథకు నాయకుఁడు 'శిరోమణి' నాయకి 'కేసరి' ఈమె సింహళద్వీపపు వర్తకుఁడగు ధనకోటిరాజు కొమార్తె. ఈమె కేడువత్సరముల ప్రాయమప్పుడు ఆదేశపు రాజుగారితో 'శిరోమణి' వీరింటికొకదినమువచ్చెను. అప్పుడు వీరిద్దరొండొరులఁగని మోహముఁగనిరి. వారి ప్రేమానుబంధము నానాటికి వృద్ధిఁజెందెను. శిరోమణికిఁ దనకొమార్తెను వివాహముఁ జేయుట ధనకోటి కెంతమాత్ర మిష్టములేదు. కాని కేసరిమాత్రము శిరోమణినే వివాహమాడుటకు నిశ్చయించియుండెను. శిరోమణికి నాగరాజను పినతండ్రికలఁడు. ఇతఁడు మిక్కిలి దుర్మార్గుఁడు. కాని రాజుగారి యాస్థానమునందు మిగులఁ బ్రబలియుండెను. అతఁడు తన మాయోపాయములచే శిరోమణికిని, అతని పెత్తండ్రికుమారుఁడు మహీపతికిని, పలువిధములయిన బాధలఁ గలుగఁజేసి రాజద్రోహులని ప్రభువునకు నమ్మకము పుట్టించి వారిని రాజాగ్రహమునకుఁ బాత్రులుగఁజేసెను. తుదకు వారు నిర్దోషులుగ నెంచఁబడి మన్నింపఁబడిరి. నాగరాజు తాను త్రవ్వినగోతిలోఁ దానే పడెను. బడాచోరను దొంగయొక్క మాయోపాయములుకూడ చక్కఁగ వర్ణింపఁబడినవి. తుదకు వాఁడుకూడ విఫలప్రయత్నుఁడై దూరదేశములకుఁ బాఱిపోయెను. కేసరికిని శిరోమణికిని జరిగిన వివాహమహోత్సవములతో గ్రంథముకూడ ముగిసెను. వలయువారలు చెన్నపురి గ్రంథకర్తగారికి వ్రాసి పుస్తకములను బడయవచ్చును. వెల ఎనిమిదణాలు.

A. S.

మాంసభక్షక వృక్షములు.

సామాన్యముగా వృక్షములన్నియు వ్రేళ్ళమూలమున భూమిలోనుండి సారమును గ్రహించి బ్రతుకును. నాచుమొక్కలు మొదలగునవి కొన్ని భూమిలోనికి వేళ్లు పాఱక నీటిపైని తేలుచు జలములోని సారమునుపీల్చి బ్రతుకును. ఇవిగాక మాంసమును తిని జీవించెడు వింతలైన మొక్కలును లోకములోఁ గొన్నికలవు. ఇవి తమమీఁద వాలిన పురుగులు మొదలయిన చిన్నజంతువులను భక్షించును. ఈ చిన్నచెట్లలో ననేక జాతులుగలవు. అందొకజాతిచెట్టుయొక్క పత్రముమీఁద పురుగువాలఁగానే వాలిన పురుగు తప్పించుకొని మరల నెగిరిపోవుట కవకాశము కలుగకుండునంత వేగముగా ఆయాకు ముడుచుకొనిపోయి యాపురుగును తనలోపల బంధించివేయును. అట్లు పట్టుపడిన పురుగుయొక్క మాంసమంతయు కరఁగి వృక్షములోనికి పోవువఱకును ఆకు పట్టువిడువకయుండి తరువాత యథాప్రకారముగా విడిపోవును. ఇంకొకజాతి చెట్టుయొక్క యాకులపయిని కొన్నికాడలు పైకిలేచియుండును. ఆయాకుమీఁద నేదైనపురుగువాలఁగానే యాకాడవంగి యాపురుగును తన కొనలయందూరెడు జిగురుతో పట్టుకొనును. ఆపురుగు దానిని విడిపించుకొనిపోవుటకు శక్తనుగాక యందు తగులుకొనియుండి యావృక్షముచే భక్షింపఁబడును. కొన్ని దినములతరువాతఁజూచిన పక్షమున, అట్లు పట్టుపడిన పురుగుయొక్క మెత్తనిభాగ మేదియు నిలిచియుండక లోపలికిపోయి ఱెక్కలు మొదలయిన పనికిరాని భాగములుమాత్రమే పైని మిగిలియుండును. ఇట్లు పురుగులను పట్టుకొనెడి యాకులమీఁది కాడయొక్క రూపము క్రిందిపటమునఁ జూపఁబడియున్నది. వంగిన కాడయొక్క కొన నంటిపట్టుకొన్న పురుగు మీకిందుఁ గనఁబడుచున్నదిగదా. ఇట్లు పురుగును పట్టుకొనెడి కాడకొనయందలి జిగురు తెగిపోక తీగెలుసాగుచుండును. ఆ జిగురునకు సూదిమొన నంటించి సూదిని తీసినపక్షమున సూది పొడుగునను పట్టుదారమువలె జిగురుతీగెలు సాగుచు బహుదూరమువచ్చును. ఈచెట్లుచిత్తడి నేలలయందుండును. వీనికి వేళ్లు భూమిలోనికి లోతుగానుండక పైపైని నాటుకొనియుండును. అందుచేత భూమిలోనిసారమేమియు చెట్లులోనికి పోదు. ఈచెట్లుగాలిలోని సారమును తమమీఁద వాలిన పురుగులనుమాత్ర మాహారముగాఁ గొని బ్రతుకును. పరిశోధించినకొలఁదిని సృష్టిమహిమలు



చిత్రవిచిత్రములుగా నుండును.